# ఆంధ్రాస్ ఆర్ కమింగ్




**మా**కాలనీలో చాలామంది పిల్లలు ఇంటర్ పరీక్షలు రాశారు. అయితే పరీక్షలు రాస్తున్నప్పుడే వాళ్ళ పరీక్షా ఫలితాలు ఎలా వుంటాయో మాకు తెలిసిపోయాయ్. ప్రశ్నాపత్రంలో ఒకటి రెండు ప్రశ్నలు తప్ప మిగతా వాటి గురించి తమ టెక్ట్స్‌బుక్స్‌లో ఎక్కడా ఏమీ లేదని, ఉన్నా ఆ పోర్షన్ సిలబస్‌లో లేదని తామనుకున్నామనీ అన్నారు వాళ్ళు.

అయితే తీరా వాళ్ళ ఫలితాలు ఆ రోజు పేపర్లో వచ్చేసరికి కాలనీలో అందరికీ మతులు పోయినంత పనయింది.

అసలు చదవని వాళ్ళకు ఫస్ట్ క్లాస్, కొంచెం చదివిన వాళ్ళకు సెకండ్ క్లాస్, బాగా చదివిన వాళ్ళకు థర్డ్ క్లాస్ వచ్చాయ్.

ఎప్పుడూ డిస్టింక్షన్‌లో పాసయ్యే ఒకే ఒక్క అమ్మాయి మాత్రం తప్పింది.

మా అందరికీ అర్థమయిపోయింది.

"ఇది ఖచ్చితంగా కంప్యూటర్ పనే" అన్నాడు రంగారెడ్డి ఖచ్చితంగా.

"కంప్యూటర్ కాకపోతే ఇంత అవకతవకలుండవ్. నాకూ అదే అనిపిస్తోంది" అన్నాడు శాయిరామ్. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఇలాంటి అవకతవకలకు ప్రథమస్థానం వహిస్తున్న

విషయం నిజమే అవడం చేత మిగతా వారందరూ కూడా మా అభిప్రాయాలతో ఏకీభవించారు. అయితే హఠాత్తుగా మాకో విషమ సమస్య ఎదురయింది.

అందరూ న్యాయంగా అయితే తప్పాలి గనుక వాళ్ళ భవిష్యత్తు గురించి పెద్దగా ప్లాన్ చేయడానికి ఏమీ లేకపోయింది.

"మళ్ళీ సెప్టెంబర్‌లోనో, మార్చిలోనో పరీక్షలకు కట్టి పాసయినప్పుడు చూద్దాం!" అనుకున్నారు.

ఇంక గత్యంతరం లేక నగరంలోని అన్ని కాలేజీలకు అప్లికేషన్‌లు గుప్పించాం. మామూలుగానే ఎక్కడా సీటు దొరకలేదు.

ఎవర్నడిగినా బి.ఎ.కయితే సీటు ఇస్తామంటున్నారు. బి.ఎ. చదివితే ఆ వచ్చే ప్యూన్ ఉద్యోగం కూడా రాదని మాకు తెలుసు.

"బి.కామ్, బి.ఎస్సీ, కంప్యూటర్ లాంటివి కావాలంటే ఆంధ్రప్రదేశ్‌లో కుదరదు. మా కర్నాటక వెళ్ళండి" అన్నాడు ఓ కన్నడ ఫ్రెండ్.

"అక్కడ మనకే కోర్సు కావాలంటే అది చదువుకోవచ్చా?" ఆశ్చర్యంగా అడిగాం మేము.

"ఎంట్రెన్స్‌కూడా లేకుండా చదువుకోవచ్చు."

"ఎంట్రెన్స్ కూడా లేకుండానా?" మరింత ఆశ్చర్యపోతూ అడిగాము.

"అవును...." మేము ఆశ్చర్యంలో మరింత లోతుకి కూరుకుపోయాము.

"అదే కాదు, ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, పాలిటెక్నిక్, బి.ఇడి., ఏదైనా సరే."

అందరం ఘొల్లున నవ్వేశాం అతని మాటలకు.

"ఏం జోక్ చేస్తున్నావ్‌రా నాయనా! ఎంట్రెన్స్ లేకుండా ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్‌లో సీట్లు దొరుకుతాయా?"

మిగతా వాళ్ళందరూ కూడా అతనిని పిచ్చివాడిని చూసినట్టు చూశారు.

"పిచ్చి నాక్కాదయ్యా! మీ ఆంధ్రాస్‌కి ఎక్కింది. అడుక్కుతినే రాష్ట్రం! అడుక్కుతినే చదువులు! బోడి సినిమాలు తీయడంలోనే ఫస్ట్ మీరు!" అనేసి కోపంగా వెళ్ళిపోయాడతను.

"ఒకవేళ వాడు చెప్పేది నిజమేనేమో" అన్నాడు గోపాల్రావ్ అనుమానంగా.

"ఏడ్చావ్! మనక్కావలసిన చదువు చదువుకోవడం ఇండియాలో ఎలా సాధ్యమవుతుంది?" అన్నాడు జనార్ధన్. "వాడు చెప్పేది ఇంకేదో దేశంలో కర్నాటక అనే ఊరు గురించి అయి వుంటుంది–"

"అయితే ఈ కర్నాటక అనేది ఒక వేళ ఎక్కడయినా విదేశాల్లో వుందేమో. ఎంక్వయిర్ చేద్దాం" అన్నాడు రంగారెడ్డి.

"అవును. ఆ పేరుతో ఇంకెక్కడో ఏదో దేశం వుండి ఉంటుంది. లేకపోతే మనదేశంలో మామూలు మిడిల్‌క్లాస్ మనుషులకు చదువుకునే అవకాశం ఎందుకుంటుంది?" అన్నాడు శాయిరామ్.

"ఈ కిరికిరంత ఎందుకు భాయ్! జర వరల్డ్ మాప్‌ల చెక్ జేస్తే మంచిగుంటది కద!' అన్నాడు యాదగిరి. ఎవరో ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళి మాప్ తీసుకొచ్చారు. అందులో అన్ని దేశాలూ చూశాంగానీ ఎక్కడా కర్నాటక అనేది కనిపించలేదు.

"అయితే ఇది మనదేశంలోని కర్నాటకే అయి వుంటుంది" అన్నాడు గోపాల్రావ్ మళ్ళీ అనుమానంగా.

ఈలోగా చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఓ ఇంగ్లీష్ డెయిలీ తీసుకొచ్చాడు.

"ఇది మన పొరుగు కర్నాటక రాష్ట్రమే గురూ! ఇదిగో ఈ పేపర్ నిండా ఆ రాష్ట్రంలోని కాలేజీల ప్రకటనలే! ఎల్.ఎల్.బి., పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్, మెడిసిన్ అన్నీ ఎంట్రెన్స్ లేనివే వున్నాయక్కడ. మన దిక్కుమాలిన రాష్ట్రంలాగా ఎంట్రెన్స్‌లూ, పిచ్చిరాం కులూ, కొశ్చెన్ పేపర్లు అవుటయి కొంతమంది రాజకీయ నాయకుల బంధువుల పిల్లలే సెలక్టవటాలూ ఇవేమీ లేవట! కేవలం సెకండ్ క్లాస్‌లో ఇంటర్ పాసయితే, ఇంజనీరింగ్, మెడికల్ రెండింటికి అప్లయ్ చేసుకోవచ్చు-" న్యూస్ పేపర్లోని ప్రకటనలు చూస్తూ అన్నాడతను.

ఆ రాత్రి మా కాలనీలో చాలా కుటుంబాల్లో ఎవరికీ నిద్రపట్టలేదు.

"ఏమండీ! మన వాడికి మన రాజధానిలో ఎక్కడా పనికిమాలిన డిగ్రీకి కూడా సీటు దొరకలేదు కదా! వాడిని పోనీ కర్నాటకలో ఇంజనీరింగ్‌లో చేర్చేద్దాం..." అంటోంది మా పక్కింటావిడ.

"సరే! వాడు ఇంజనీర్ కావాలని వాడి జాతకంలో రాసి పెట్టి వుందేమో! అందుకే మన రాష్ట్రంలో బీఏకి సీటు దొరకలేదు అంతా మనమంచికే" అన్నాడతను.

రంగారెడ్డి భార్య ఇంకో మెట్టు పైకెళ్ళిపోయింది.

"కర్నాటకలో నాలుగేళ్ళ నుంచీ వున్న వాళ్ళ పిల్లలకు కేవలం సంవత్సరానికి ఎనిమిది వేలే ఫీజుటండీ- ఇంజనీరింగ్‌లో! అదీ ఎంట్రెన్స్‌లో సెలక్టయితే ఇంకా తక్కువట! మనం కర్నాటకకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోదాం పదండి- మన పిల్లలు పెద్దాళ్ళయేసరికి లోకల్ కాండిడేట్స్ అయిపోతారు-" అంటోందామె.

"కానీ మన రాష్ట్రం నుంచి కర్నాటక రాష్ట్రానికి నాకు ట్రాన్స్‌ఫర్ ఇవ్వరే!"

"అయితే ఈ దిక్కుమాలిన ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగానికి రాజీనామా చెయ్యండి. కర్నాటకలో ఏదొక ఉద్యోగం దొరక్కపోదు."

మర్నాడు మీటింగ్‌లో కొంతమంది కలిసి కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళి పరిస్థితేమిటో స్వయంగా కనుక్కోవాలని నిర్ణయించుకున్నాం.

హైదరాబాద్‌కు దగ్గరగా వుంది గుల్బర్గా కనుక అక్కడికి చేరుకున్నాం అందరం. రైలు దిగగానే ఆటోవాళ్ళు "ఓరే ఖాజా! ఆంధ్రాస్ ఆయేరే! ఆంధ్రాస్ ఆయే" అని అరుచుకుంటూ మా చుట్టూ మూగారు.

"మేమంత హొటల్‌కెళ్ళాలి. ఎంత కావాలి?" అడిగాడు రంగారెడ్డి.

"టూ హండ్రెడ్ సర్"

అందరం అదిరిపడ్డాం.

"అంటే నువ్వనేది మా అందరికీ కలిపా?"

"కాద్సార్! ఒక్క ఆటో! అంటే ముగ్గురికి–"

"మరి మూడొందలంటావేమిటి?"

"మరి రెండొందలే మూలకి సార్! ఒక పూట మందు ఖర్చులేదు."

"ఏమిటి? ఒక పూట మా మందు ఖర్చు రెండొందలా? ఏయ్– సంవత్సరాని క్కూడా అంత ఖర్చవదయ్యా మాకు! మీటర్ రీడింగ్ ప్రకారం వస్తావా రావా?"

ఆటోవాళ్ళందరూ మొఖాలు చూసుకున్నారు.

"వీళ్ళు ఆంధ్రాస్ కాదురా! ఇంకెవరో అయివుంటారు. ఆంధ్రాసైతే ఇలా బేరాలాడరు మస్తు పైసలుంటయ్ ఆళ్ళదగ్గర" అన్నాడొకడు.

"అచ్చం ఆంధ్రాస్‌లాగా భలే ఫోజ్ కొట్టార్లే" అన్నాడు ఇంకొకడు. అందరూ మమ్మల్ని వదిలేసి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

మేము నడుస్తూ దగ్గర్లో వున్న ఒక లాడ్జికి చేరుకున్నాం.

"మాకు ఆరు డబుల్ రూమ్స్ కావాలి" అన్నాడు రంగారెడ్డి.

"ఎక్కడి నుంచి వచ్చారు మీరు?"

"హైదరాబాద్"

అతను ఆశ్చర్యపోయాడు.

"అంటే మీరు ఆంధ్రాసా?"

"అవును!"

"మరి మీ కార్లేవి!"

"కార్లా? కార్లేమిటి?"

"ఆంధ్రాస్ అయితే కార్లలో వస్తారు కదా! మీరు ఆంధ్రాస్ కాదు కదూ?"

"ఆంధ్రాసేనయ్యా! అయినా మేమెవరయితేనేం? రూమ్స్ వున్నాయా లేవా?"

"ఉన్నయ్‌లెండి! అరే దస్తగిర్! వీళ్ళకు మామూలు రూమ్స్ ఇవ్వరా! ఆంధ్రాస్ ఇంకా రాలేదు. ఈ రాత్రికి వస్తారేమో! ఆ డీలక్స్ రూమ్స్ ఖాళీగానే వుండనీయండి"

మాకు వళ్ళు మండిపోయింది గానీ మధ్యలో తల దూర్చడమెందుకని ఊరుకున్నాం. త్వరగా రడీ అయి అందరం ఇంజనీరింగ్ కాలేజీకి బయల్దేరాం.

హోటల్ ఆవరణ దాటి రోడ్ మీద కొచ్చేసరికి ఓ కారు రివ్వుమంటూ వచ్చి మాముందాగింది. అంఉదలో మంచి ఓ సూట్‌వాలా దిగాడు.

"హలో సార్! నమస్తే– ఆంధ్రాస్ కదూ!" చిరునవ్వుతో పలకరించాడు.

"అవును!"

"నేనిప్పుడే అనుకున్నాను! వెరీ గ్లాడ్ టు మీట్ యూ! ఇలా పక్కకు రండి!" అన్నాడతను.

పక్కకు ఎందుకు రమ్మంటున్నాడో, అసతలను ఎవరో మాకేం అంతుబట్టలేదు.

ఏం జరుగుతుందో చూద్దామని రోడ్ పక్కనున్న చెట్టుకిందకు వెళ్ళి అతని చుట్టూ మూగాము.

"బ్రహ్మాండమయిన స్టాండర్డ్ సార్! ఫారిన్ స్టాండర్డ్! కారు చవక! ఎన్ని కావాలి?" అడిగాడతను. మాకు అర్థమయిపోయింది వాడెవరో స్మగుల్డ్ సామాన్లమ్మేవాడని!

వెంటనే శాయిరామ్ కుతూహలంగా అతని దగ్గరకు జరిగాడు.

"జపాన్ వాచీలున్నాయా? ఎలక్ట్రానిక్‌వి"

"నాకు త్రీ ఇన్ వన్ కావాలి! దొరుకుతుందా?" అడిగాడు గోపాల్రావ్.

అతను ఆశ్చర్యంగా చూశాడు మావేపు.

"అదేమిటి? నేను స్మగుల్డ్ సామాన్లమ్మే వాడిననుకుంటున్నారా?"

మేము తెల్లబోయాం.

"కాదా? అయితే మరి ఇందాక మీరు దేన్ని గురించి మాట్లాడారు?"

"ఇంజనీరింగ్ అండ్ మెడికల్ సీట్స్ గురించి సార్! అదురుపాటు స్టాండర్డ్ వున్న కాలేజీలు! కారు చవక! ఎన్ని సీట్లు కావాలి?"

మాకు మతిపోయినంత పనయింది.

కర్నాటకలో ఇంజనీరింగ్ కాలేజీలు బోలెడున్నాయని తెలుసుగానీ మరీ ఇంత చవకలో– ఇలా వాళ్ళే మన దగ్గరకొచ్చి సీట్లు అమ్ముతారని తెలీదు.

"ఒక్క నిమిషం!" అని అతనితో చెప్పి మేమంతా అతనికి దూరంగా జరిగి మాలో మేము గుసగుసలాడుకోసాగాం.

"ఏయ్? మనం చౌకగా వస్తోందికదా అని తొందరపడి సీట్లు కొనేయకూడదు.

మనకేం ఆసక్తి లేనట్లు కొంచెం బేరాలాడదాం! వాడు ధర తగ్గిస్తే తగ్గించవచ్చు!" అన్నాడు రంగారెడ్డి.

మళ్ళీ అందరం అతని దగ్గరకు నడిచాము.

"ఇదిగో చూడబ్బీ, ఓకో ఇంజనీరింగ్ సీట్‌కి మూడువేలిస్తాం, ఇస్తే ఇవ్వు లేకపోతేలేదు" అన్నాడు అప్పలాచారి.

ఆ వ్యక్తి మా వంక విచిత్రంగా చూశాడు.

"నీయమ్మ– నాకప్పుడే డౌటొచ్చింది– ఆంధ్రాస్ అయితే ఇలా అడుక్కుతినే వాళ్ళలాగా వుండరే అని! పైగా కార్లులేవు! మీరు టమిళియన్స్‌గానీ, కేరళైట్స్‌గానీ అయుంటారు కదూ" అడిగాడు అతను.

"కాదు! మేము ఆంధ్రాసే" కోపంగా అన్నాడు గోపాల్రావ్.

"ఆంధ్రాసయితే ఇంత గీసిగీసి బేరాలడగరే! ఒకవేళ మీ ఫోర్ ఫాదర్స్ మద్రాస్కిగానీ, కేరళాగానీ చెంది వుంటారు"

అతను కార్లో వెళ్ళిపోయాడు.

తిన్నగా మేమందరం ఓ ఇంజనీరింగ్ కాలేజీకి చేరుకున్నాం.

ప్రిన్సిపాల్ రూమ్ చేరుకోగానే ప్యూన్ వినయంగా వంగి నమస్కారం చేసి తలుపు తెరిచి పట్టుకున్నాడు.

మాకు మతిపోయినంత పనయింది.

"అదేమిటి? ప్రిన్సిపాల్‌గారి పర్మిషన్ తీసుకున్నావా?"

"మీరు ఆంధ్రాసే కద్సార్! పర్మిషన్ అక్కర్లేదండి! మీ కోసమే మా కాలేజీ కమిటీ మెంబర్లందరూ రెండ్రోజుల్నుంచి వెయిట్ చేస్తున్నారు సార్!"

మేము లోపలికి నడిచాం. మమ్మల్ని చూడగానే లోపల అందరూ ప్రేమగా చిరునవ్వు నవ్వారు.

"రండి! వెల్‌కమ్ టు కర్నాటకా– ఇండియాలో మిగతా రాష్ట్రాలన్నిటికి విద్యాదానం చేస్తున్న మా రాష్ట్రానికి స్వాగతం" అన్నాడు ప్రిన్సిపాల్.

అందరం నమస్కరించి కూర్చున్నాం.

"ఎన్ని సీట్లు కావాలి?" అడిగాడు ప్రిన్సిపాల్.

"పన్నెండు"

"ఒండర్‌ఫుల్! మీ బ్రీఫ్‌కేస్‌లేవీ!"

మేము అదిరిపడ్డాం.

"బ్రీఫ్‌కేస్‌లేమిటి?"

"అదే! ఆంధ్రాస్ బ్రీఫ్‌కేస్‌లో నోట్లకట్టలు తెస్తారు కదా!"

మేము నవ్వేశాం.

"మా దగ్గర అలాంటివేమీ లేవండి! మేము మామూలు మిడిల్‌క్లాస్ వాళ్ళం"

అతను ఆశ్చర్యపోయాడు.

"ఆంధ్రాస్‌లో మిడిల్ క్లాసువాళ్లుకూడా వుంటారా?"

"ఎందుకు వుండరండి? మేము ప్రత్యక్షంగా కనబడుతూనేవున్నాం కదా!"

ప్రిన్సిపాల్ వెంటనే ఎక్కడికో ఫోన్ చేశాడు.

"త్వరగారండి! ఇక్కడ కొంతమంది ఆంధ్రాస్ వచ్చారు! వాళ్లు బీదాళ్ళట! తమాషాగా లేదూ. రండి వాళ్ళను చూద్దురుగాని" అన్ని కన్నడలో చెప్పి ఫోన్ పెట్టేశాడు.

మాకు వళ్ళు మండిపోతోంది- మమ్మల్ని 'జూ'లో జంతువుల్లా అతను ట్రీట్‌చేయడం.

"ఇంతకూ డొనేషన్ ఎంతో చెప్తే మేం ఆలోచించుకుంటాం" అన్నాడు రంగారెడ్డి కోపంగా.

"డొనేషన్ మామూలే! ముప్ఫయివేలు. అదిగాక నాలుగేళ్ళ ఫీజు కూడా ముందే కట్టాలి"

"ఫీజెంత?"

"సంవత్సరానికి పన్నెండున్నరవేలు చొప్పున యాభయివేలు"

మాకు గుండాగినంత పనయింది.

"అదేమిటి? ఫీజు సంవత్సరానికి ఎనిమిదివేలే అన్నారు కదా"

"అది జనతా ప్రభుత్వం రోజుల్లో- ఇప్పుడు గవర్నర్ రూల్ కదా! ఆమాత్రం పెరగదేమిటి?"

మేము మాట్లాడకుండా లేచి బయటికొచ్చాం.

రోడ్‌మీద కొచ్చేసరికి నలుగురు వ్యక్తులు మా చుట్టూ మూగారు.

"ఇంజినీరింగ్ మెడికల్ సీట్లుసార్! అయిదువేలు డొనేషన్- బెంగుళూరు, బీజాపూర్, తుంకూర్, కోలార్, హుబ్లి, ధార్వాడ్, ఖార్కి; బీదర్" అన్నాడొకతను.

"అయిదువేలేనా?" ఆశ్చర్యంగా అడిగాడు శాయిరామ్.

"అవున్సార్! కేవలం అయిదువేలు! ఎన్నిమ్మంటారు?"

"పన్నెండు కావాలి? మొత్తం మీద ఏమయినా తగ్గిస్తావా?" అడిగాడు రంగారెడ్డి.

"నాలుగువేలు సీటుచొప్పున ఇవ్వండిసార్- తలో అయిదొందలు అడ్వాన్స్ కట్టండి చాలు"

"మరి ఫీజుకూడా ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం కడతాం"

"ఏం ఫర్లేదుసార్! అంతా మీ ఇష్టం"

మేము డబ్బు లెక్కపెడుతుంటే అతనిపక్కనున్న రెండోవాడు ఘొల్లున నవ్వాడు.

"గోవిందా! గోవిందా! వాడు చెప్పిన కాలేజీల్లో చేరారో మీ పిల్లల భవిష్యత్తు గోవిందా గోవిందా!"

మేము కంగారుగా డబ్బు లెక్కపెట్టడం ఆపి వాడివేపు చూశాం.

"ఏమిటి నువ్వనేది?"

"ఆ కాలేజీలో చేరిన పిల్లలందరూ బెంగుళూరు కెంప్‌గౌడ రోడ్‌లో ఫుట్‌పాత్ పక్కన పడివుంటారు చూళ్ళేదా?"

"అదేమిటి? ఎందుకలా పడివుండడం?"

"ఎందుకేమిటి సార్! డ్రగ్స్! అంతా డ్రగ్ ఎడిక్ట్స్ అయిపోతారు. ఆ తరువాత ఇంకేముంది గోవిందా, గోవిందా–"

మాకు గుండె ఆగిపోయినంత పనయింది.

"అంచేత నా దగ్గరున్న లిస్ట్‌లోని కాలేజీల్లోనే చేరండి! ఫీజు యాభయ్‌వేలు కడితే చాలు! నో డొనేషన్" మాకు ఎక్కడలేని ఆనందం కలిగింది.

"డొనేషన్స్ అస్సలు లేవా?"

"అస్సల్లేద్సార్–"

"మరి అక్కడ డ్రగ్స్ లేవా?"

"డ్రగ్స్ అస్సల్లేవు! మోస్ట్ డిసిప్లిన్డ్ ఇన్‌స్టిట్యూషన్స్! సీటుకి రెండొందలు చొప్పున అడ్వాన్స్ కొట్టండి చాలు–"

మేము తలో రెండొందలూ పోగుచేస్తుండగా మూడోవాడు ఘొల్లున నవ్వాడు.

"డ్రగ్స్ లేవనగానే బోల్తాపడిపోయారు సార్! కానీ ఆ కాలేజీల్లో స్టాఫ్ లేరుసార్! ప్రొఫెసర్లంతా డిప్లొమా హోల్డర్స్– లాబోరేటరీలు లేవు. వర్క్ షాప్ లేదు ఇంక మీ పిల్లలు చూస్కోండి! తాపీ మేస్త్రీలవుతార్సార్! ఇంజనీర్లు కాదు–"

మాకు ఏడుపొచ్చేసింది. రెండోవాడివేపు కోపంగా చూశాం.

"అతను చెప్పేది నిజమేనా?"

"అంతా అబద్ధం! మొన్నే ఒక కంప్యూటర్‌కి కూడా ఆర్డరిచ్చారు మావాళ్ళు. మీ కుర్రాళ్ళు ఫైనలియర్ కెళ్ళే లోపల వచ్చేస్తుందది"

"మరి ఈలోగా ఏం చేస్తారు?"

"మరి ఈలోగా బోర్డ్‌మీద బొమ్మలు గీసి చెప్తారు. కంప్యూటర్ రియల్ ఫోటోలు చూపిస్తారు– అంతకంటే ఇంకేం కావాలి?"

మాకు పిచ్చెక్కినట్టయింది.

ఈలోగా ఇంకోడెవరో దూరం నుంచి అరిచాడు.

"ఒరే మందారా! త్వరగా రా! అసలీ ఆంధ్రాస్ వస్తున్నారిక్కడ- త్వరగరా రియల్ ఆంధ్రాస్ డబ్బుకట్టల్తో వచ్చారు-"

ఆ మాట వింటూనే వాళ్ళంతా పరుగుతో వెళ్ళిపోయారు.

మేం బ్రతుకు జీవుడా అని అక్కడినుంచి బయల్దేరాం.

వారం రోజులపాటు పాతిక కాలేజీలకు వెళ్ళి వివరాలన్నీ వాకబు చేసుకుంటూ డొనేషన్‌లు బేరాలాడుకుంటూ చివరకు ఓ ఊళ్ళోని కాలేజీలో సీట్లు కొనేశాం.

"హమ్మయ్యా!- ఎలాగైతేనేం మన మధ్యతరగతి పిల్లలు కూడా ఇంజనీరింగ్ చదివే అవకాశం మనకిచ్చిన కర్నాటక ప్రజలకు జై" అన్నాడు రంగారెడ్డి.

అప్పుడే ప్రిన్సిపాల్ గదిలోకి ఓ వ్యక్తి పరుగెత్తుకెళ్ళాడు.

"మా డబ్బు మాకిచ్చేయండి సార్- మా వాడిక్కడ చదవనంటున్నాడు-" అంటూ బ్రతిమాలడం వినిపించింది మాకు.

"ఒకసారి కట్టిని డబ్బు ఏ పరిస్థితుల్లోనూ తిరిగి ఇవ్వబడదు అని బోర్డు పెట్టాం కద్సార్."

పాపుగంటసేపు బ్రతిమాలి అతను కళ్ళవెంబడి నీరు పెట్టుకుంటూ బయటికొచ్చేసాడు.

మేమంతా అతనిచుట్టూ మూగాం.

"ఏమిటి? ఎందుకు డబ్బు వాపస్ అడుగుతున్నారు?"

"ఈ కాలేజీకి యూనివర్శిటీ రికగ్నిషన్ రాలేదంట సార్! కిందటి సంవత్సరం స్టూడెంట్స్‌ని పరీక్ష రాయనీలేదట"

మా గుండెలవిసిపోయాయ్.

"రికగ్నిషన్ లేకుండా కాలేజీ పెడితే గవర్నమెంట్ ఎలా ఊరుకుంది?"

"గవర్నమెంట్‌కేం సంబంధం? వాళ్ళు కాలేజీ పెట్టడానికి పర్మిషన్ ఇచ్చారు- అంతే! యూనివర్సిటీ ఎఫ్లియేషన్స్ తెచ్చుకోవడం కాలేజీ వాళ్ళ తలనొప్పి ఇక"

"మరి యూనివర్సిటీ ఛాన్సెలర్ లింగాయత్ కమ్యూనిటీకి చెందినవాళ్ళు- కాలేజీ ఓనర్ గౌడా కమ్యూనిటీకి చెందినవాళ్ళూ. అంచేత తన కంఠంలో ప్రాణం వుండగా ఇవ్వనని ఛాన్సెలర్ పట్టు పట్టాడట."

మాక్కూడా ఆ మాట వినేసరికి ఏడుపొచ్చింది.

అందరం మళ్ళీ ప్రిన్సిపాల్ దగ్గరకు పరుగెత్తాం. అప్పటికే మరో పాతికమంది మాలాంటి పేరెంట్స్ మూగిపోయి వున్నారతని చుట్టూ.




"నేను చెప్తున్నాను కదా. మీకేం ఫర్లేదు. మన కాలేజీకి ఇంకోవారం రోజుల్లో ఎఫ్లియేషన్ వచ్చేస్తుంది. మన కేసు సుప్రీంకోర్ట్‌కి కూడా వెళ్ళింది– ఒకవేళ రాకపోతే అప్పుడు మీ డబ్బు మీకు వాపస్! సరేనా?"

చేసేది లేక తలూపి బయటపడ్డాం.

బస్‌లో తిరిగి హైదరాబాద్ బయల్దేరాం. బస్‌లో అందరూ మాలాంటివాళ్ళే. ఇంజనీరింగ్, లా, ఫార్మసీ, పాలిటెక్నిక్ చదవటానికి వచ్చిన వాళ్ళు. కొద్దిసేపటి తర్వాత కర్నాటక రాష్ట్రంలోనుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించింది మా బస్.

రోడ్డుకి అడ్డంగా కట్టిన ఆర్చీమీద "ఆంధ్రప్రదేశ్ మీకు స్వాగతం చెప్తోంది" అని రాసి వుంది.

దానిమీద తాటిచెట్టంత ఎత్తున ముఖ్యమంత్రి బొమ్మ చిరునవ్వుతో చేతులు జోడిస్తోంది.

"నీయవ్వ ఆంధ్రప్రదేశ్! థూ! చదువుల కోసం పక్క రాష్ట్రాల కెళ్ళి నానా అవస్థలు పడాల్సి వచ్చిన పనికిమాలిన రాష్ట్రం!" అన్నాడు రంగారెడ్డి.

"పనికి మాలిన రాష్ట్రమేమిటి? అడుక్కుతినే రాష్ట్రం! మనం దీపం వెలిగించుకోవాలన్నా కూడా పొరుగు రాష్ట్రాన్ని కరెంట్ అడుక్కోవాలి" అన్నాడు శాయిరామ్.

"ఆఖరికి కిలో రెండ్రూపాయలు బియ్యం కావాలన్నా కేంద్రాన్ని అడుక్కోవాలి!" అన్నాడు గోపాల్రావ్.

ఆ తరువాత మన రాష్ట్రం ఇంకా ఏమేం విషయాల్లో ఇతర రాష్ట్రాల్ని అడుక్కుతిం టోందో మాలో అందరూ తలోటీ చెపుతుంటే మాకే సిగ్గేసింది. ఆ పక్కనే వినబడుతోంది. "మా తెలుగు తల్లికి మల్లెపూదండ–" అనే పాట–

* * * * *